క్లుప్తంగా

బీసీ హాస్టల్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వెల్ఫేర్ అధికారి గంగాద్రి

బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను అనంతపురం వెల్ఫేర్ అధికారి గంగాద్రి గురువారం తనిఖీ చేశారు. హస్టల్‌లోని రికార్డులను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచుకోవాలని వార్డెన్ కుళ్లాయిస్వామికి సూచించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. ఈశ్వరరెడ్డి గురువారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలన్నారు.

ఒంటరి మహిళలకు ఆర్డీటీ చేయూత



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్

శెట్టూరు: ఒంటరి మహిళలకు ఆర్డీటీ చేయూతనిస్తుందని సంస్థ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ నిరంజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఒంటరి మహిళల సాధికార దినం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల నుంచి ఒంటరి మహిళలు, సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఒంటరి మహిళలకు రెండు నెలలకొకసారి నిత్యావసర సరుకులు, వారి పిల్లల చదువుల కోసం ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావ్, ఏటీఎల్ బాషా, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి

కళ్యాణదుర్గం రూరల్: శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలని ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య పిలుపు మేరకు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు మాదిరిగా ఉద్యోగ సమయం కేటాయించాలన్నారు. టెక్నికల్ సర్వీసులైన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, మ్యారేజ్, శానిటేషన్ సర్టిఫికెట్లు, ఎన్‌ఓసీల జారీ అధికారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్ కుమార్, శ్రీకాంత్, సతీష్, రాజు, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సర్మస్ హుసేనీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

గాయపడిన వృద్ధుడి మృతి



మృతిచెందిన కన్నే నాయక్

రాయదుర్గం రూరల్: మండలంలోని కొంతానపల్లి వద్ద ఈ నెల 7న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాతిబావి వంక(బొందనకల్లు)కు చెందిన కన్నే నాయక్ అలియాస్ గుంగో (65) బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఈనెల 7న జరిగిన ఆటో ప్రమాదలంట కన్నే నాయక్‌కు నడుము భాగాన దెబ్బలు తగలడంతో పాటు ఎడమ చేయి విరిగింది. ఆయనను హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు అనంతపురానికి, అక్కడి నుండి కర్నూలుకు రెఫర్ చేశారు. రెండు వారాల పాటు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందగా, పోస్టు మార్టం అనంతరం గురువారం గ్రామంలో ఖననం చేసినట్లు పోలీసులు తెలిపారు. భార్య తిల్లీ బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

ఉద్యానానికి ఉపాధి ఊతం

- పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- ఎకరానికి రూ.1.04 లక్షలు మూడేళ్ల పాటు అందజేత
- పూల మొక్కల పెంపకానికీ సాయం



రాయదుర్గం మండలంలో ఉపాధి పథకం ద్వారా సాగు చేపట్టిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం: సంప్రదాయ పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల వైపు అడుగులు వేస్తున్నారు. బంజరు భూములు, మెట్ట ప్రాంతాల్లో పండ్లు, పూల తోటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఔత్సాహిక రైతులకు ఉపాధి పథకం కింద ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు నేరుగా నిధులు కేటాయించి అండగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారు. రైతన్నల వార్షిక ఆదాయం పెంపు ఒక్క ఉద్యాన పంటకే సాధ్యమని గుర్తించి ఆ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకువచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో ఈ ఏడాది 3 వేల ఎకరాలకు తగ్గకుండా ఉద్యాన సాగు చేపట్టాలని ఉపాధి అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇప్పటికే 60 శాతానికి పైగా రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు.

పండ్ల తోటల సాగుకు అర్హత ఇలా..

పండ్ల తోటల సాగు చేపట్టేందుకు సన్న, చిన్న కారు రైతులు మాత్రమే అర్హులు. బీసీ వర్గానికి చెందిన రైతులకైతే ఐదు ఎకరాల్లోపు మెట్టభూమి కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకై తే 10 ఎకరాల్లోనూ మెట్ట భూమి ఉండాలి.

ప్రభుత్వ సాయం ఇలా..

ఉపాధి పథకం ద్వారా మూడేళ్ల పాటు నిర్వహణ కోసం ఎకరాకు రూ.1.04 లక్షల సాయం ప్రభుత్వం అందజేస్తోంది. మామిడి, సపోట, కొబ్బరి, అల్లనేరేడు లాంటి మొక్కలు ఎకరాకు 70 నాటుకోవచ్చు. ఒక్కో మొక్కకు ప్రభుత్వమే రూ.45 చెల్లిస్తోంది. గుంత తీయడానికి రూ.96, మొక్క నాటడానికి రూ.17 చొప్పున చెల్లిస్తారు. మొక్కకు పాది కట్టడానికి, నీరు పట్టడానికి, సంరక్షణ కోసం సంబంధిత రైతుకే నెలకు రూ.2,200 చొప్పున ఏడాదికి 8 నెలల పాటు రూ.17,600 అందిస్తారు. ఈ విధంగా మూడేళ్ల పాటు రైతు ఖాతాకే నగదు చెల్లిస్తారు. అలాగే గులాబి, మల్లె మొక్కల పెంపానికి రెండేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు చెల్లించనున్నారు. 25 సెంట్ల భూమిలో 400 మొక్కలు నాటుకుంటే, మొక్కకు రూ.25 చెల్లిస్తారు. గుంత తీసి, మొక్క నాటడానికి రూ.55 అందిస్తారు. అలాగే నీరు పట్టడానికి, కలుపు, సంరక్షణ కోసం రూ.2,570 చొప్పున రైతుకు అందజేస్తారు.

నాలుగు ఎకరాల్లో మామిడి సాగు



ఉపాధి పథకం ద్వారా ఎకరాకు 70 మొక్కల చొప్పున నాలుగు ఎకరాల్లో 280 మామిడి మొక్కలు నాలుగేళ్ల క్రితం నాటాను. ప్రస్తుతం కాపు కొచ్చాయి. చెట్లు మరింత బలంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఎక్కువ క్రాప్ పట్టకుండా జాగ్రత్త పడ్డా. వచ్చే ఏడాది నుంచి జీవిత కాలం పాటు ఆదాయ వనరుగా మారనుంది. మూడేళ్ల పాటు ప్రభుత్వమే డబ్బు చెల్లించి మొక్కలు పెంచుకునేలా ప్రోత్సహించింది.

– సీ శాంతమ్మ, మహిళా రైతు, రంగచేడు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పండ్ల తోటల పెంపకం తోనే రైతుకు సుస్థిరాభివృద్ధి సాధ్యం. పైసా ఖర్చులేకుండా ఉపాధి పథకం ద్వారా చేపట్టే ఈ గొప్ప పథకాన్ని అర్హత కలిగిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. రైతు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే 60 శాతం పైగా రైతులు ముందుకొచ్చారు. ఆసక్తి కలిగిన వారు ఎంతమంది వచ్చినా పథకం వర్తింప జేసేలా చర్యలు చేపడతాం.

– జయకుమార్‌బాబు, ఏడీ, రాయదుర్గం

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కణేకల్లు: స్థానిక మోడల్ స్కూల్‌లో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆదినారాయణప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తరగతిలో 36 సీట్లు ఖాళీగా ఉండగా 8వ తరగతిలో 45 సీట్లు, 9వ తరగతిలో 37 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ నెల 28వ తేది ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

చదువుకు పేదరికం అడ్డు రాకూడదు



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

కళ్యాణదుర్గం రూరల్: చదువుకు పేదరికం అడ్డుకాకూడదని ఉపాధ్యాయుడు బద్దే నాయక్ అన్నారు. శెట్టూరు మండలం కై రేవు గ్రామానికి చెందిన రత్నమ్మ, తిమ్మరాజు కుమారుడు తిరుపస్ గుంటూరులో డిప్లమో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజు రూ.25,000 వేలు చెల్లించాల్సి ఉండగా నేడు ఆఖరి తేదీ కావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు బద్దేనాయక్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూ.25 వేలు అందించి ఉదారత చాటుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు అతడికి కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దాసా నాయక్

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవానితిప్ప గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్. దాసానాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్ల హాజరు శాతాన్ని పరిశీలించారు. సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ ఫస్టు ర్యాంకర్‌కు సన్మానం



కీర్తిశ్రీని సత్కరించి నగదును అందజేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపీపీ కరణం పుష్పావతి అధ్వర్యంలో ఇంటర్ హెచ్‌ఈసీలో 954 మార్కులు సాధించి స్టేట్ ఫస్టు ర్యాంకర్‌గా నిలిచిన కీర్తిశ్రీని ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. విద్యార్థు లను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా మండలం, నియోజక వర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులను సత్కరించడమే కాకుండా ప్రశంసా పత్రం, మెడల్, నగదు ఇచ్చి సత్కరించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థిని కీర్తిశ్రీని వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్ శ్రీరాములు, గాజుల వెంకటేశులు, మాధవరెడ్డి, పీసీ కమిటీ చైర్మన్ గిరిబాబు, జయసింహా, ఉమాశంకర్, సురేష్‌యాదవ్, రఘురాములు, రాజశేఖర్, పాల్తూరు ఆనందరాజు, చిట్టిబాబు, వరాదరెడ్డి, మేకల రామాంజనేయులు, హేమంత్, హనుమంతుయాదవ్ తదితరులు శాలువా కప్పి సత్కరించారు. తమవంతుగా రూ.15వేలు విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుమడుగు శ్రీరాములు, రాముడరెడ్డి, జగదీష్‌రెడ్డి, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడాన్ని బాధ్యతగా తీసుకోవాలి



మొక్క నాటుతున్న దృశ్యం

వజ్రకరూరు: మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సర్పంచు కవితాభాయి సూచించారు. గురువారం మండలంలోని ఎన్ఎన్ పీతండా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ పరిసర ప్రాంతం తోపాటు రోడ్డు కు ఇరువైపులా మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుంక్యానాయక్, రూప్లనాయక్, గోవిందునాయక్, సీడీసీ మెంబర్ గోవిందునాయక్ , సీబీటీ టీచర్ వి.గోవిందు నాయ క్, వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న నూతన విద్యుత్ సబ్ స్టేషన్

కూడేరు: మండలంలోని తిమ్మాపురం-పి.నారాయణపురం గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ఏప్రిల్ 12న సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎంపీపీ నారాయణరెడ్డి భూమి పూజ చేశారు. సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. జూలై నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తవుతాయని ట్రాన్స్‌కో ఏఈ గౌస్ గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ ప్రారంభమైతే తిమ్మాపురం , కరుట్లపల్లి, పి.నారాయణపురం, జయపురం , చోళసముద్రం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో లో-ఓల్టేజీ సమస్య ఉండదన్నారు. వ్యవసాయానికి నిరంతరం 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడానికి వీలుంటుందని ఏఈ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

బొమ్మనహాళ్: మండలంలోని దుద్దేకుంట సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని ఏఎస్ఐ రామదాసు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.14000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జవాబుదారీగా పని చేయండి

కూడేరు: ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీగా పని చేయాలని తహసీల్దార్ శేషారెడ్డి సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు భూసమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సంబంధించి సంతకాలు వెంటనే పెట్టి ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీటీ విశ్వనాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం, శేజ్ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు అనంతస్వామి, భక్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం బాక్సులను చూపుతున్న పోలీసులు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని గొడిశెలపల్లికి చెందిన వద్రమ్మ, క్రిష్ణాపురానికి చెందిన మనవడు బోయ రమేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తూ గురువారం సరిహద్దు ప్రాంతంలో పట్టుబడ్డారని ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. వారి నుంచి 288 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఒక ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. అవ్వ, మనవడిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

శెట్టూరు: మండలం తిప్పనపల్లి - అయ్యగారిపల్లి మధ్య బైకు అదుపు తప్పి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అయ్యగార్లపల్లికి చెందిన నారాయణ వ్యక్తిగత పని నిమిత్తం తిప్పనపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. అయ్యగార్లపల్లి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో నారాయణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయండి



పౌర సంబంధాల కమిషనర్ విజయకుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేసేలా కృషి చేయాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ టి.వి జయకుమార్‌రెడ్డిని గురువారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలసి విజ్ఞప్తిచేశారు. ఈ విషయాన్ని స్థానిక మీడియాకు ఆయన తెలిపారు. విప్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ల విషయం లో ఉదరాస్వభావాన్ని చాటుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు న్యాయ చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అర్హత ఆధారంగా అందరికీ న్యాయం చేస్తున్నామని, మీ విజ్ఞప్తిని కూడా పరిశీలనలోకి తీసుకుని మరింత ఎక్కువ మందికి అక్రిడిటేషన్లు అందించేలా కృషి చేస్తామన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

రాయదుర్గం రూరల్: శ్మశాన వాటిక సమస్య పరిష్కరిస్తామని దళితులకు తహసీల్దార్ మారుతి గురువారం హామీ ఇచ్చారు. మండలంలోని రాతిబావి వంక (బొందనకల్లు) గ్రామంలోని సర్వే నెంబర్ 61లోని 9.99 ఎకరాల శ్మశాన వాటికను కొంతమంది ఆక్రమించారు. దళితులు మృతదేహాలను పూడ్చగా , గుంతలో పూడ్చిన శవాన్ని తీసి వేరేచోట ఖననం చేసుకోండని ఆక్రమణ దారులు చెప్పడంతో ఆగ్రహించిన దళితులు గత 15 రోజులుగా నిరసనలకు తెరలేపారు. అందులో భాగంగానే గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరగోపాల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మారుతి స్పందించి భూమి సర్వే చేయించి, రాళ్లను పాతించి, సంబంధిత భూమిని పంచాయతీ కార్యాలయానికి అప్పగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈశ్వరయ్య, పెన్నప్ప, శ్రీనివాసులు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం యువతుల వివాహానికి చేయూత



పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న అంజుమన్‌కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: నిరుపేద ముస్లిం కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహానికి రాయదుర్గం అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అండగా నిలుస్తోంది. ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకున్న తొమ్మిది మంది పేదింటి అమ్మాయిల పెళ్లికి ఒక్కొక్కరికి రూ. 7 వేల చొప్పున రూ.63 వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఇటీవల ఐదుగురు పేద ముస్లిం అమ్మాయిల వివాహానికి ఆర్థికసాయం అందజేయగా తాజాగా మరో తొమ్మిది మందికి సాయం చేయడంపట్ల సర్వత్రా హర్షం వ్యక్తంచేశారు. గురువారం అంజుమన్ కమిటీ కార్యాలయంలో పెళ్లి కుమార్తెల తల్లిదండ్రులను పిలిపించి అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలు తమ పిల్లల వివాహానికి ఆర్థికసాయం కోసం 15 రోజుల ముందే అంజుమన్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరిశీలించిన అనంతరం అర్హులకు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి మొహ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు డ్రైవర్ బాష, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకిర్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి



మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్

వజ్రకరూరు: వలంటీర్లు,సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్ సూచించారు. గురువారం మండలంలోని గడేహోతురు సచివాలయంలో సర్పంచు కె.సురేంద్ర అధ్యక్షతన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుందన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చిన్న సమస్య ఉన్నా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అలాగే మండలంలోని చిన్న హోతురు, చాబాల గ్రామాల్లో కూడా ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో గడేహోతురు సర్పంచ్ సురేంద్ర, సచివాలయ కన్వీనర్ కె.పార్వతి, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, గ్రామకార్యదర్శి సుభాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ కార్యాలయంగా హెచ్చెల్సీ అతిథి గృహం

- అతిథి గృహంలోకి సామగ్రి తరలింపు
- ఇక వీఐపీలకు తప్పనితిప్పలు



సబ్ డివిజన్ కార్యాలయంగా మారిన హెచ్చెల్సీ అతిథి గృహం

కణేకల్లు: కణేకల్లు పట్టణానికొచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆరు దశాబ్దాల పాటు ఆతిథ్యమిచ్చిన హెచ్చెల్సీ అతిథిగృహం ఇకపై సబ్ డివిజన్ కార్యాలయంగా మారింది. ఈ ప్రాంతంలో హెచ్చెల్సీ కాలువ నిర్మాణ సమయంలో అంటే 1962లో హెచ్చెల్సీ ఉన్నతాధికారుల విడిది కోసం రామనగర్‌లోని హెచ్చెల్సీ కాలనీలో విశాలమైన ప్రదేశంలో అతిథిగృహాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 61 సంవత్సరాల పాటు వివిధశాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులకు ఈ అతిథి భవనం ఆతిథ్యమిచ్చింది. కలెక్టర్, మంత్రుల మొదలు వివిధశాఖల ఉన్నతాధికారులు ఇక్కడికొచ్చి విశ్రాంతి తీసుకొని లంచ్ అనంతరం వెనుదిరిగేవారు. ఐతే కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ నూతన కార్యాలయం భవనం గత 14 ఏళ్ల నుంచి అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇప్పటి వరకూ అధికారులు సెక్షన్ కార్యాలయంలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని నిర్వహించారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయాన్ని ఎక్కడికి మార్చాలో దిక్కుతోచక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో హెచ్చెల్సీ ఉన్నతాధికారులు గెస్ట్‌హౌస్‌ను ఆఫీసుగా మార్చేయమంటూ ఉత్తర్వులిచ్చారు. దీంతో సబ్ డివిజన్ డీఈఈ గోపాల్ నాయక్, ఇక్కడి సిబ్బంది గెస్ట్‌హౌస్‌ను ఎత్తేశారు. ఈ గెస్ట్‌హౌస్‌లో ఉన్న మంచాలు, కుర్చీలు తదితర సామగ్రిని గురువారం మరోచోటకు తరలించారు. అనంతరం ఈ గెస్ట్‌హౌస్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని సబ్ డివిజన్ కార్యాలయంగా మార్చేశారు. ఇందులో రెండు గదులుండగా ఒక గదిని రికార్డు రూమ్‌గా... మరో గదిని డీఈఈ అండ్ స్టాఫ్ రూమ్‌గా మార్చారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలంలో అధికారులకు ఆతిథ్యమివ్వడానికి ఉన్న ఏకైక అతిథిగృహం సబ్‌డివిజన్ కార్యాలయంగా మారడంతో ఇకపై ఈ ప్రాంతాలకొచ్చే వీవీపీలు, ప్రజాప్రతినిధులకు కష్టాలు తప్పవు. ఇక్కడ ఓ గెస్ట్ హౌస్ ఉందనే విషయం అందరూ మరిచిపోవాల్సిందే.